ఆర్ఎస్ఎస్, బిజెపిపై రాజకీయ, సైద్ధాంతిక పోరాటం

- వామపక్ష, లౌకిక శక్తులను ఐక్యం చేస్తాం
- ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలి
- సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఆర్ఎస్ఎస్, బిజెపిపై రాజకీయంగా, సైద్ధాంతికంగా పోరాటం చేయాలని సిపిఎం మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కరత్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందుకోసం వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులను ఐక్యం చేస్తామని చెప్పారు. ఎన్నికల కమిషన్ (ఇసి) రాజకీయ ఉద్దేశంతో నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌ను అమలు చేయాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందని, ఇంకా తుది తీర్పును వెల్లడించలేదని గుర్తు చేశారు. ఇసి స్వతంత్రంగా వ్యవహరించాలనీ, ప్రజలు స్వేచ్ఛగా ఓటేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రారంభమైన సిపిఎం అఖిల భారత స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఆరు రోజులపాటు నిర్వహించారు. మంగళవారం ముగింపు కార్యక్రమానికి ప్రకాశ్‌కరత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పార్టీని బలోపేతం చేయాలని ఏప్రిల్‌లో మధురైలో నిర్వహించిన సిపిఎం 24వ మహాసభలో లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. పార్టీ స్వతంత్ర బలాన్ని పెంచుకోవడంతోపాటు రాజకీయంగా, సైద్ధాంతికంగా బలోపేతం కావాలని అన్నారు. రాజకీయ శిక్షణ తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. పార్టీ సభ్యత్వం, నిర్మాణం బలోపేతం కావాలని చెప్పారు. ఆర్ఎస్ఎస్, బిజెపి, హిందూత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గుప్పెట్లో పెట్టుకుందని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలనూ నిర్వీర్యం చేస్తున్నదని చెప్పారు. 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ నిర్వహించాలని ఇసి ప్రకటించిందని అన్నారు. రెండు నెలల క్రితం ఎస్ఐఆర్‌ను బీహార్‌లో నిర్వహించిందని గుర్తు చేశారు. లౌకిక, ప్రతిపక్ష పార్టీలన్నీ ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశాయని చెప్పారు. బతికున్న ప్రజల ఓట్లను ఇసి తొలగించిందని విమర్శించారు. ఎస్ఐఆర్‌పై సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. ఇప్పుడు 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ అమలు చేయాలని ఇసి ప్రకటించిందని అన్నారు. ఎస్ఐఆర్‌కు వ్యతిరేకంగా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించలేదన్నారు. మధ్యంతర ఉత్తర్వులు మాత్రమే ఇచ్చిందనీ, ఇంకా తుది తీర్పు వెల్లడించలేదని గుర్తు చేశారు. ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ ఆ ప్రక్రియను నిలిపేయాలని కోరుతూ కేరళ అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. అక్కడ స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయని చెప్పారు. ఈ సమయంలో ఎస్ఐఆర్‌ను నిర్వహిస్తే ప్రజలు గందరగోళానికి గురవుతారని అన్నారు. ఓటర్ జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు ఆధార్ కార్డును కూడా పరిగణనలోకి తీసుకోవాలని ఇసిని సుప్రీంకోర్టు ఆదేశించిందని చెప్పారు. రాజకీయ ఉద్దేశంతో ఇసి నిర్ణయాలు తీసుకుంటున్నదని విమర్శించారు. ఇసి స్వతంత్రంగా వ్యవహరించాలనీ, ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇసి తీరుపై అనుమానాలు వస్తున్నాయని అన్నారు. గతంలో ఇసి నిర్ణయాలను అధికారంలో ఉన్న పార్టీ వ్యతిరేకించేదని గుర్తు చేశారు. ఇప్పుడు అధికార పార్టీకి అనుకూలంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. ఇసి స్వతంత్రతను కోల్పోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్, బిజెపి హిందూత్వ ఎజెండాను అమలు చేస్తున్నాయని విమర్శించారు. మైనార్టీలపై దాడులు చేస్తున్నాయని చెప్పారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మైనార్టీలే లక్ష్యంగా పాలన సాగుతున్నదని అన్నారు. బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ బలోపేతానికి, నాయకుల ఎదుగుదలకు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

లౌకిక శక్తులను ఒక వేదిక మీదకు తేవడమే లక్ష్యం : రాఘవులు

పార్టీ నాయకులు, కార్యకర్తలకు సిద్ధాంత, రాజకీయ అవగాహనను పెంచడం కోసమే ఈ శిక్షణ తరగతులను నిర్వహించామని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు చెప్పారు. రాబోయే కాలంలో బిజెపి, ఆర్ఎస్ఎస్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటాలకు తమ పార్టీ శ్రేణులను సంసిద్ధం చేస్తామని అన్నారు. లౌకిక శక్తులన్నింటినీ ఒక వేదిక మీదకు తేవడం తమ లక్ష్యమన్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి : జాన్‌వెస్లీ

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు బకాయిలను చెల్లించకుండా కాలయాపన చేయడం వల్ల విద్యార్థులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ధ్రువపత్రాలు కాలేజీ యాజమాన్యాల వద్ద ఉన్నాయని అన్నారు. ఉన్నత చదువులకు వెళ్లడానికి ఉద్యోగాలు చేయడానికి ఇబ్బందిగా మారిందన్నారు. ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న విద్యార్థి సంఘాల రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పిందని అన్నారు. ఖాళీ పోస్టులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భర్తీ చేయాలంటూ నిరుద్యోగ జెఎసి చేపట్టే ఆందోళనలకు మద్దతు ప్రకటించారు. సిపిఎం మాజీ ఎంపీ పికె బిజు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

కన్నబిడ్డ విక్రయ ఘటనపై మంత్రి సీతక్క సీరియస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లాలో కన్నబిడ్డ విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా తో మంగళవారం మాట్లాడారు. వెంటనే పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పిల్లల అమ్మకాలపై, అక్రమ దత్తత పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తున్నా.. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. శిశువును సంరక్షణలోకి తీసుకొని తల్లి పరిస్థితిని తెలుసుకోవాలని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లీబిడ్డల రక్షణ తమ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమనీ, పేదరికం, అజ్ఞానం కారణంగా ఇలాంటి దారుణాలు జరగడం పట్ల బాధ కలుగుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ, బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరు కూడా ఇలాంటి అన్యాయాలను నిరోధించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చిన్నారిపై లైంగిక దాడి పట్ల మంత్రి ఆగ్రహం వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన చిన్నారిపై లైంగిక దాడి జరిగిన ఘటన పట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అమానుష ఘటనలు సమాజాన్ని కలచివేస్తాయని, దోషులను కఠినంగా శిక్షించాలన్నది ప్రభుత్వ సంకల్పమని ఆమె స్పష్టం చేశారు.

డిపిఎస్ విద్యార్థులకు మంత్రి శ్రీధర్‌బాబు అభినందనలు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (డిపిఎస్) విద్యార్థులు క్రీడారంగంలో ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు మంత్రి డి శ్రీధర్‌బాబు అభినందించారు. ఇటీవల హైదరాబాద్‌లోని చేతన్ ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమిలో నిర్వహించిన అండర్-13 జాతీయ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో సింగిల్స్ విభాగంలో ఏడో తరగతి చదువుతున్న సహస్ర కాంస్య పతకం సాధించారు. ఏడో తరగతి చదువుతున్న అన్య డబుల్స్ విభాగంలో బంగారు పతకం, సిబిఎస్ఇ జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం గెలిచారు. మంగళవారం డిపిఎస్ సిఇఒ మల్క యశస్వీ, బ్యాడ్మింటన్ కోచ్ హర్ష, విజేతలు మంత్రి డి శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్యాడ్మింటన్‌లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులను అభినందించారు. విద్యతోపాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తున్న డిపిఎస్ యాజమాన్యాన్ని ధన్యవాదాలు చెప్పారు. డీపీఎస్ విద్యార్థుల విజయాలు ఆ పాఠశాలకే కాకుండా రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.

ఆటో డ్రైవర్ల గురించి కెటిఆర్ మాట్లాడటం హాస్యాస్పదం

- టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ అధికారంలో ఉన్నపుడు ఆకాశంలో విమానాల్లో విహరించిన ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్.. ఇవాళ అధికారం పోగానే ఆటోల్లో తిరగడం, ఆటో డ్రైవర్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ అన్నారు. హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా రహమత్ నగర్ న్యూటన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతంలోని వాడవాడలా ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ ప్రచారంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆనాడు ఎన్నికల సమయంలో వాగ్దానం చేసిందన్నారు. ఇందులో భాగంగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించి, విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. అదేవిధంగా బడుగు, బలహీన వర్గాల పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, సన్నబియ్యం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు తదితర అనేక సంక్షేమ పథకాలను సక్సెస్ ఫుల్‌గా అమలు చేస్తుంటే, చూసి ఓర్వలేని ప్రతిపక్ష బిఆర్ఎస్, బిజెపి నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని బండి సుధాకర్ గౌడ్ పేర్కొన్నారు.

పోలింగ్‌లో ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకం

- పిఒ, ఎపిఒ, ఒపిఒలు పూర్తి అవగాహనతో విధులకు వెళ్లాలి
- హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కమిషనర్ ఆర్‌వి కర్ణన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులది కీలకపాత్ర అని, విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన పెంచుకుని ఉప ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల అధికారి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్ సూచించారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మంగళవారం హైదరాబాద్ షేక్‌పేట జి.నారాయణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల పోలీస్ పరిశీలకులు ఓంప్రకాశ్ త్రిపాఠి, వ్యయపరిశీలకులు సంజీవ్ కుమార్‌లాల్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీఓ, ఏపీఓలకు పోలింగ్ రోజు వారి విధులు, బాధ్యతలపై జిహెచ్ఎంసి ఎన్నికల విభాగం అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి జిల్లా ఎన్నికల అధికారి కర్ణన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. శిక్షణ కోసం ఉపయోగించే బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్‌లు, వివి ప్యాట్‌లతో అనుసంధాన ప్రక్రియ, మాక్ పోలింగ్, ఓటింగ్ జరిపే విధానంపై మాస్టర్ ట్రైనర్‌లు ప్రత్యక్ష అవగాహన కల్పించారు. నోటాతో కలిసి 59 మంది అభ్యర్థులు బరిలో ఉన్నందున ఒక్కో పోలింగ్ కేంద్రానికి 4 బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌కు అనుసంధానం జాగ్రత్తగా చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ రోజు ముఖ్యమైందని, ఎన్నికల కమిషన్ రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ప్రతి పీఓ, ఏపీఓ తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని నిబంధనలను పాటించాలని సూచించారు. పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్‌లిస్టు తయారు చేసుకొని విధులు నిర్వహించాలని చెప్పారు. రెండు విడతలుగా జరిగిన ఈ శిక్షణ కార్యక్రమానికి బాధ్యులు సునంద, మమత, 500 మందికి అధికారులు హాజరయ్యారు.

ప్రభుత్వ బడికి రూ.10 కోట్లు మంజూరు

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ ఏడాది జనవరి 31న నిర్వహించిన ఆ పాఠశాల 150వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మొగిలిగిద్ద జడ్‌పిహెచ్ఎస్ నూతన భవన నిర్మాణం కోసం నిధులను కేటాయిస్తామంటూ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు రూ.10 కోట్లు మంజూరు చేయడం గమనార్హం. ఈ పాఠశాలకు గొప్ప చరిత్ర ఉన్నది. ప్రస్తుతం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమంలో బోధన సాగుతున్నది. హైదరాబాద్ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మర్రి చెన్నారెడ్డి, పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ కూడా ఈ పాఠశాలలో చదవడం విశేషం.

ఎంజిఎం ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ పి హరీశ్ చంద్రారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరంగల్ ఎంజిఎం ఆస్పత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా మంచిర్యాల ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.హరీశ్ చంద్రారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా జెడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ వరుస ఘటనలపై సీరియస్ అయిన ప్రభుత్వం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిషోర్‌పై వేటు వేసిన సంగతి తెలిసిందే.

అల్వాల్‌లో యూకో బ్యాంక్ శాఖ ఏర్పాటు

హైదరాబాద్ : యూకో బ్యాంక్ తన కొత్త శాఖను నగరంలోని అల్వాల్‌లో ఏర్పాటు చేసింది. దీనిని యూకో బ్యాంక్ తెలంగాణ జోన్ జోనల్ మేనేజర్ ఎన్ శ్రీకాంత్ లాంచనంగా ప్రారంభించారు. ఇది తెలంగాణలో యూకో బ్యాంక్‌కు 46వ శాఖ. ఈ ప్రాంతంలో కస్టమర్‌లకు ఉత్తమ సేవలు అందించడానికి, స్థానిక వ్యాపారులు, బిల్డర్లకు ఆర్థిక సౌకర్యాలు కల్పించడానికి ఈ శాఖను అందుబాటులోకి తెచ్చామని ఎన్ శ్రీకాంత్ తెలిపారు. యూకో బ్యాంక్ మొబైల్ బ్యాంకింగ్ యాప్ అత్యధిక రేటింగ్ పొందిన యాప్ అని కూడా ఆయన గుర్తు చేశారు. ఈ శాఖ ప్రారంభోత్సవంలో అల్వాల్ శాఖ మేనేజర్ ఎ భరత్ చంద్ర పాల్గొన్నారు.

సినీ కార్మికులకు సిఎం వరాల జల్లు

- రూ.10 కోట్లతో వెల్ఫేర్ బోర్డు
- సొంతిళ్ల కేటాయింపుపై అధ్యయనం
- డిసెంబర్ 9 నాటికి అన్ని అంశాలపై తుది నిర్ణయం
- సినీ కార్మికుల అభినందన సభలో రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

సినీ కార్మికులపై సిఎం ఎ రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపించారు. డిసెంబర్ తొమ్మిది నాటికి వారి సమస్యల పరిష్కారంపై అధ్యయనం చేసి స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. సినీ కార్మికుల కోసం రూ.పది కోట్లతో వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామనీ, కొత్త సినిమాలకు టిక్కెట్ రేట్లు పెంచమని నిర్మాతలు ప్రభుత్వం వద్దకు వస్తుంటారనీ, అలా పెంచిన టిక్కెట్ రేట్లలో నుంచి 20 శాతం సొమ్మును వెల్ఫేర్ బోర్డులో డిపాజిట్ చేసేలా ఆదేశాలు ఇస్తామన్నారు. సినీ కార్మికులు కూర్చుని మాట్లాడుకోవడానికి అవసరమైన భవన నిర్మాణం కోసం ఇక్కడికి సమీపంలోనే ప్రభుత్వ భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే కృష్ణానగర్ సహా చిత్ర పరిశ్రమపై ఆధారపడి బతుకుతున్న వారి పిల్లలకు ఉన్నతమైన ఉచిత విద్యను కేజీ నుంచి ప్లస్ టూ వరకు ప్రభుత్వమే అందిస్తుందనీ, దీనికోసం త్వరలో స్కూల్ భవనాన్ని నిర్మిస్తామని తెలిపారు. ఆ స్కూల్‌లోని పిల్లలకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా ఏర్పాటు చేస్తామన్నారు. స్టంట్ మాస్టర్ల రిహార్సల్స్ కోసం భూమి కావాలని కోరారనీ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో దానికి అవసరమైన భూమిని కేటాయిస్తామని స్పష్టం చేశారు. సినీ కార్మికుల ఆరోగ్య భద్రతను ఆరోగ్యశ్రీ ద్వారా పరిరక్షిస్తామన్నారు. సినీ కార్మికులకు సొంతిళ్ల ఏర్పాటుపై అధ్యయనం చేసి, కచ్చితంగా సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. నవంబర్ నెలఖరులోపే సినీ కార్మిక సంఘాల నేతలతో మరోసారి భేటీ అయ్యి, అన్ని విషయాలపై చర్చించి, డిసెంబర్ తొమ్మిదిన ఆ నిర్ణయాలపై ఉత్తర్వులు జారీచేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారంనాడిక్కడి యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సినీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన పాల్గొని, మాట్లాడారు. తెలుగు సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించేందుకు ఆనాటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి తీవ్రంగా కృషి చేశారనీ, ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు, సూపర్‌స్టార్ కృష్ణ వంటి వాళ్లతో సుదీర్ఘ సంప్రదింపులు జరిపి, సినీ పరిశ్రమను ఇక్కడకు తరలించారని తెలిపారు. సినీ కార్మికుల సంక్షేమం కోసం అనాటి మేటి నటులు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి మణికొండలో తన పది ఎకరాల సొంత స్థలాన్ని విరాళంగా ఇచ్చారని గుర్తుచేశారు. ఆ తర్వాత సినీ కార్మికుల కోసం చిత్రపురి కాలనీ ఏర్పాటైందని వివరించారు. చిత్ర పరిశ్రమలో కళాకారులు రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్నారని, వారి శ్రమ, కష్టం తనకు తెలుసన్నారు. తెలుగు సినిమాను ఆస్కార్ స్థాయికి తీసుకెళ్లడం వెనుక సినీ కార్మికుల కష్టం ఉందన్నారు. గడచిన పదేండ్లుగా నిలిపివేసిన నంది అవార్డుల స్థానంలో ప్రజా యుద్ధనౌక గద్దర్ అవార్డులను అందిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచ సినీ పరిశ్రమకు వేదిక కావాలనీ, తెలంగాణ రైజింగ్-2047 ప్రణాళికలో తప్పకుండా సినీ రంగానికి ప్రత్యేక చాప్టర్ ఉంటుందని చెప్పారు. ఐటీ, ఫార్మా లాగే సినీ పరిశ్రమకు తమ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తుందన్నారు. హాలీవుడ్‌ను తెలంగాణకు రప్పించే బాధ్యత తానే తీసుకుంటాననీ, ఆ స్థాయిలో తనకు సినీ కార్మికుల సహకారం కావాలని కోరారు. అనంతరం సినీ కార్మిక సంఘాలు సీఎం రేవంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించాయి. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ దిల్‌రాజు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిమా గ్రూపుతో సెరీస్ కమ్యూనిటీస్ భాగస్వామ్యం

రాష్ట్రంలో 400 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ : సీనియర్ లివింగ్ ఆపరేటర్ అయిన కొలంబియా పసిఫిక్ ఆధ్వర్యంలోని సెరీన్ కమ్యూనిటీస్ మంగళవారం ప్రతిమా గ్రూప్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. ఈ ఒప్పందం తెలంగాణలో సెరీన్ అధికారిక ప్రవేశాన్ని సూచిస్తుందని పేర్కొంది. హైదరాబాద్‌లో సుమారు రూ.400 కోట్ల పెట్టుబడులకు యోచిస్తోన్నట్లు ఇరు సంస్థలు తెలిపాయి. ఈ భాగస్వామ్యం ద్వారా సరీన్ కమ్యూనిటీస్ అంతర్జాతీయ నైపుణ్యానికి తోడు ప్రతిమా గ్రూప్ నిర్మాణ విశిష్టత కలయికలో రెండు ప్రాజెక్టులను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించాయి. శంకర్‌పల్లిలో తమ మొదటి ప్రాజెక్ట్ సరీన్ బిల్వాణి వన్‌కు రేరా అనుమతి లభించిందని తెలిపింది. రెండవ ప్రాజెక్ట్ వివరాలు త్వరలో ప్రకటించనున్నట్లు సెరీన్ కమ్యూనిటీస్ బై కొలంబియా పసిఫిక్ సిఇఒ రాజగోపాల్ తెలిపారు. సరీన్ కమ్యూనిటీస్‌తో భాగస్వామ్యం ద్వారా తాము హైదరాబాద్‌కు అంతర్జాతీయ ప్రమాణాల సీనియర్ లివింగ్ అనుభవాన్ని అందిస్తునున్నామని ప్రతిమా గ్రూప్ డైరెక్టర్ ఎబివిఎస్ ప్రకాష్ రావు పేర్కొన్నారు.

పుస్తక పఠనం వ్యసనంగా మారాలి

- సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి కల్చరల్

ఆధునిక సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ జీవితం పరుగులు పోటీగా మారిందని సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. అట్టి పరిస్థితిలో రచనలు చేస్తూ సమాజానికి అందిస్తున్న పెద్దూరి వెంకట దాసు వంటివారు అభినందనీయులు అని ఆయన చెప్పారు. ప్రతి గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు ఉండి గ్రంథ పఠనం వ్యసనంగా మారాలని మంత్రి జూపల్లి కోరారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో జివిఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పెద్దూరి వెంకట దాసు రచించిన ప్రేమ చిగురించిన శుభ వేళ కథా సంపుటి ఆవిష్కరణ సభ జరిగింది. సంపుటిని జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించి మాట్లాడారు. సాంస్కృతి అంటే జీవన విధానం అన్నారు.నేడు సమాజంలో పలు అకృత్యాలు దౌర్జన్యాలు జరుగుతున్న సందర్భంలో సంస్కృతి పరిరక్షణకు నైతిక విలువలు బోధించే ప్రేమ చిగురించిన శుభ వేళలో కథలు రావాలని అన్నారు. వెంకట దాసు రచన వ్యాసంగం కొనసాగించాలని, ఇందుకు సాంస్కృతిక శాఖ ప్రచురణ బాధ్యత స్వీకరిస్తుందని తెలిపారు. సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ సున్నితం గా సూటిగా కథావస్తువు వెంకట దాసు చెప్పటంలో నేర్పరి అని అన్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి అధ్యక్షత వహించిన సభలో నేటి నిజం సంపాదకుడు బైస దేవదాసు, సాహితీ కిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, కె మదన్ మోహన్ తదితరులు అభినందన తెలుపగ రచయిత్రి విజయ లక్ష్మి గ్రంథ సమీక్ష చేశారు. డాక్టర్ రంగయ్య సభా నిర్వహణ చేయగా సంస్థ కార్యదర్శి రాఘవ రెడ్డి స్వాగతం పలికారు.

యువకుడి దారుణ హత్య

- నిందితుల కోసం పోలీసుల గాలింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కూలి పనికి వెళ్లి తిరిగి వస్తున్న యువకున్ని దుండగులు దారికాచి అడ్డుకుని దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన వరంగల్ తూర్పు కోట ప్రాంతంలో సోమవారం రాత్రి జరిగింది. నిందితులు పక్కా పథకం ప్రకారం దాడి చేసి తన కొడుకుని చంపేశారని మృతుడి తండ్రి మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఈ నెల 26వ తేదీ రాత్రి సుమారు పది గంటల సమయంలో తూర్పు కోటకు చెందిన సంగరబోయిన సాయి(24) తన స్నేహితుని పుట్టినరోజు వేడుక కోసం ఔటర్ రింగ్ రోడ్డు వద్దకు వెళ్లాడు. అక్కడ బోళ్ల మహేష్‌తో సాయికి గొడవ జరిగింది. ఈ విషయాన్ని మహేష్ తన అన్న బోళ్ల రాజేష్‌కి చెప్పాడు. సోమవారం సాయి వరంగల్‌కు కూలి పనికి వెళ్లి తిరిగి వస్తుండగా.. రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో కోమట్లబండ చిన్న హనుమాన్ దేవాలయం వద్ద బోళ్ల రాజేష్, బంగారి నవీన్, బంగారి రాజు, బంగారి వినీత్‌తోపాటు మరికొంత మంది అడ్డగించారు. సాయిపై దాడి చేసి పిడిగుద్దులు గుద్దారు. ఆ తరువాత రాజేష్ ఇనుప వస్తువుతో సాయి నుదుటిపై, చాతిపై, తలపై కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఘటనను ప్రత్యక్షంగా చూసిన జట్టబోయిన రమేష్, సాయి తండ్రి కుమారస్వామికి సమాచారం అందించాడు. కుటుంబీకులు వెంటనే అక్కడికి చేరుకునేసరికి నిందితులు పారిపోయారు. రక్తపు మడుగులో పడిపోయిన సాయిని తండ్రి కుమారస్వామి, జట్టబోయిన రమేష్, హరీష్ ఆటోలో వరంగల్ ఎంజిఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయి రాత్రి 11 గంటల సమయంలో మృతిచెందినట్టు డాక్టర్లు వెల్లడించారు.దీనిపై యువకుని తండ్రి సంగరబోయిన కుమారస్వామి మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరాడు. దీనిపై సీఐ రమేష్ స్పందిస్తూ.. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని తెలిపారు. త్వరలోనే నిందితులను పట్టుకుని శిక్షిస్తామని చెప్పారు.

ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం వద్దు

- రైతులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకోండి
- అధికారులకు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని రైతు కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి సూచించారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ, ఏర్పాట్లు, ఇతర సదుపాయాలపై సభ్యులు కేవీఎన్‌రెడ్డితో కలిసి పౌరసరఫరాల శాఖ అధికారి నాగేశ్వర్‌రావుతో మంగళవారం హైదరాబాద్‌లో భేటీ అయ్యారు. ధాన్యం కాంట ఐపోగానే మిల్లులకు తరలించే బాధ్యత అధికారులు, సిబ్బంది చూసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఖరీఫ్ ధాన్యం సేకరణకు రాష్ట్ర వ్యాప్తంగా 8,342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకున్నట్లు జీఎం ఈ సందర్భంగా వారికి వివరించారు. ఇప్పటికే 4.428 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయనీ, మిగిలిన 3,814 కేంద్రాలు ప్రారంభించడానికి కసరత్తు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

IN THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL - I, AT HYDERABAD

I.A.No. 1511 OF 2025
IN
O.A.No. 228 OF 2024

Between:
State Bank of India,
Branch at MG Road, Kothagudem Branch,
Rep. by its Chief Manager.
...Petitioner/ Applicant

And
1) M/s. Marvel Car Care Multi Brand Servicing,
Chunchupalli Village & Mandal,
Badradri-Kothagudem District & Others
...Respondents / Defendants

SUBSTITUTED SERVICE OF SUMMONS UNDER RULE 23 (viii) OF DRT (PROCEDURE) RULES, 1993

To
R-1) M/s. Marvel Car Care Multi Brand Servicing, Rep. by its Partners Banoth Eeru,. Guguloth Babu and Ednuuri Nuthan Babu, Having its Officer at H.No.2-2-150/2A, Chunchupalli Village & Mandal, Badradri-Kothagudem District.
R-3) Guguloth Babu, S/o. Bhadru, R/o. H.No.1-17, Pokalagudem, Chandragudona Mandal, Badradri-Kothagudem District.

Where as the Applicant has instituted an Application under Sec.19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act, 1993, against you, for recovery of a sum of **Rs.34,94,745/-** together with future interest and other reliefs and the Hon'ble Tribunal ordered notice to you, by way of paper publication Prajasakthi Daily Telugu News Paper, Bhadradri Kothagudam District Edition and posted the matter to **1-12-2025.**

You are hereby required to show cause on **1-12-2025** at 10.30 A.M. at Debts Recovery Tribunal-1, 3rd Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in Person or by Advocate, as to, why the relief prayed for should not be granted. Take notice that, in case of default, the application will be heard and determined in your absence.

Given under my hand and the seal of this Tribunal on this 28th day of October, 2025.

ASST. REGISTRAR
Debts Recovery Tribunal-1
3rd Floor, Triveni Complex, Abids,
Hyderabad - 500 001
C. Prabakar, Advocate
Council for Applicant

IN THE COURT OF THE MVACT CUM CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD
O.P.No. 1021 OF 2025

Between:
Pallepogu Mukanya and Others
...Petitioners
A N D
Pallepogu Adam and Others
...Respondents

To,
Res-No.1:
Pallepogu Adam, S/o. Musalaiah, Aged: Major, Occ: Business, R/o. 1-21, Thurkapalle Village and Mandal, Yadadri District -508112 (Owner Cum Driver)

Please take notice that the above petitioner had filed the case for grant of compensation for the death of by name Pallepogu Premamma in a motor vehicle accident which occurred on 26-09-2024 under the limits of **P.S. Gannavaram.**

The above case is posted to **19-12-2025 at 10.30 AM** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an Advocate, else the case will be decided exparte.

[BY ORDER OF THE COURT]

Sd/- **K. ANAND REDDY,**
D. VENKAT RAMANA, Advocates,
Counsel for the Petitioners,
Off: Flat No. 212, Jamuna Towers,
Opp:Yashoda Hospital, Malakpet,
Hyderabad-500036.
Cell: 9848052455, 9848051707

అంగన్‌వాడీ నియామకాల ప్రక్రియ వేగవంతం

- సుప్రీం కోర్టు స్టే తొలిగేలా చర్యలు ప్రారంభించండి
- అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు
- లా సెక్రటరి, పిఆర్‌సి చైర్మన్‌తో మంత్రి సమావేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో లా సెక్రటరీ బి పాపిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్, పీఆర్సీ చైర్మెన్ ఎన్. శివశంకర్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజాతో మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీల నియామకాల్లో ఎదురవుతున్న న్యాయ చిక్కులపై చర్చించారు. న్యాయ చిక్కులను అధిగమించే దిశలో వారి సలహాలు, సూచనలు స్వీకరించారు. రాష్ట్రంలో సుమారు 14 వేల వరకు అంగన్‌వాడీ ఖాళీలుండగా వాటి భర్తీపై గతంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్, హెల్పర్ పోస్టులను ఎస్టీలకు రిజర్వ్ చేసిన ప్రభుత్వం, చిన్నారులు తమ మాతృభాషలో నేర్చుకోవడం సులువవుతుందన్న ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ రిజర్వేషన్లు 50 శాతం మించిపోవడంతో, కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలనీ, ఆ దిశగా లా సెక్రటరీ పాపిరెడ్డికి మంత్రి సీతక్క సూచించారు. రిక్రూట్‌మెంట్, సర్వీస్ రూల్స్‌లో నిపుణుడైన ఎన్. శివశంకర్ సలహాలతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. ఇప్పటికే కర్నాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు పర్యటించి అంగన్‌వాడీ రిక్రూట్‌మెంట్ విధానాన్ని అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు. ఆ రాష్ట్రాల్లో అంగన్‌వాడీ పోస్టులు ప్రభుత్వ సర్వీస్ కిందకు రాకపోవడం వలన సబార్డినేట్ సర్వీస్ రూల్స్ వర్తించవనీ, దీంతో రిజర్వేషన్లు 50 శాతం పరిమితి వర్తించదని అధికారులు వివరించారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో అంగన్‌వాడీ పోస్టులు ఎస్‌టిలకే రిజర్వ్ చేసిన విషయాన్ని మంత్రి దష్టికి తీసుకువచ్చారు. దీనికి అనుగుణంగా తెలంగాణలోనూ అదే విధానాన్ని అవలంబించి సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. పది రోజుల్లో నియామక ప్రక్రియకు మార్గం సుగమం చేయాలన్నారు. అంగన్‌వాడీ సేవలను మరింత బలోపేతం చేసే దిశలో కొత్త నియమాకాలు దోహద పడుతాయని ఆకాంక్షించారు. అందుకే అంగన్‌వాడీల నియమాకాలను సత్వరం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

- రెండ్రోజుల్లో విస్తారమైన వర్షాలు
- తుపాన్ ప్రభావంపై కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తుపాను ప్రభావంతో రాబోయే రెండ్రోజుల్లో విస్తారమైన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని పల్లెలు, పట్టణాలు, నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ ఎత్తు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరే అవకాశం ఉండటంతో అటువంటి ప్రాంతాల్లో నివసించే వారు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. రహదారులు, వంతెనలు, చెరువులు, వాగులు దాటే సమయంలో జాగ్రత్తగా ఉండాలని, పిల్లలు, వృద్ధులు అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉండాలని సూచించారు.

జిల్లాలో వరి పంట కోతలకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో రైతులు రాబోయే రెండు, మూడ్రోజులపాటు కోతలను వాయిదా వేసుకోవాలని పేర్కొన్నారు. ఇప్పటికే కోసిన పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించి, ఎత్తయిన ప్రదేశాల్లో నిల్వ చేయాలని సూచించారు. పంటను నష్టపోకుండా రైతులు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా ఆర్థిక నష్టాలను నివారించుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. పంట నిల్వ కేంద్రాల వద్ద నీరు చేరకుండా మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఇండిగో క్యాబిన్ క్రూ ఉద్యోగి ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇండిగో క్యాబిన్ క్రూలో పనిచేస్తున్న యువతి గదిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మూ కాశ్మీర్ ప్రాంతానికి చెందిన జాహ్నవి గుప్తా(25) ఇండిగో సంస్థలో ఉద్యోగం చేసేది. నాలుగు రోజుల కిందట తోటి స్నేహితులతో కలిసి రాజేంద్రనగర్‌లోని తన గదిలో పార్టీ చేసుకున్నారు. అనంతరం స్నేహితులందరూ వెళ్లిపోయక గదిలో ఒంటరిగా ఉన్న జాహ్నవి ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కొద్ది రోజులుగా జాహ్నవి డిప్రెషన్‌లో ఉన్నట్టు ఆమె కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు రాజేంద్రనగర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

- టిఎన్‌జిఒ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగదీశ్వర్, హుస్సేనీ ముజీబ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేనీ ముజీబ్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లో టిఎన్‌జిఒ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం 22 నెలలుగా ఎదురు చూస్తున్నామని చెప్పారు. అనేక సార్లు ముఖ్యమంత్రి, మంత్రివర్గ ఉపసంఘం, అధికారుల కమిటీతో చర్చలు జరిపామని అన్నారు. వారు స్పష్టమైన హామీలు ఇచ్చినప్పటికీ ఉద్యోగుల సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉండటం శోచనీయమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల ప్రకారం పెండింగ్ బిల్లులు నెలకు రూ.700 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తామని చెప్పి గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కమిటీతోనే పథకాన్ని ప్రారంభిస్తామంటూ హామీ ఇచ్చినా అమలుకు నోచుకోవడం లేదన్నారు. బకాయిపడ్డ ఐదు డిఎలను అడిగితే కేవలం ఒక్క డీఏ మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకోవడం సరైంది కాదని అన్నారు. 2023, జులై ఒకటి అమలు చేయాల్సిన నూతన వేతన సవరణ (పిఆర్‌సి) మాటే ఎత్తకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. సిఎం, మంత్రిమండలి సభ్యుల ఆదేశాలను గౌరవించాల్సిన అధికారులందరూ ఉద్యోగులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారా? అనే అనుమానం కలగకుండా ఉండాలంటే, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులను యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను తక్షణమే విడుదల చేయాలని చెప్పారు. ఆరోగ్య రక్షణ పథకాన్ని (ఇహెచ్‌ఎస్) పూర్తి స్థాయిలో అమలుచేయాలని సూచించారు. కాంట్రి బ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని కోరారు. వివిధ కారణాలతో సస్పెండ్ అయిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. గచ్చిబౌలి స్థలాలను భాగ్యనగర్ టిఎన్‌జిఒలకు కేటాయించాలని చెప్పారు. స్థానికత ప్రాతిపదికగా అదనపు పోస్టులు సృష్టించి 317 జిఒ బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పదోన్నతుల కమిటీలను సకాలంలో ఏర్పాటు చేసి పదోన్నతులను ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌జిఒ అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకట్, కోశాధికారి బి ముత్యాల సత్యనారాయణ గౌడ్, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, కేంద్ర సంఘ కార్యవర్గ సభ్యులు తదితరులు హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు లక్ష్మణ్, ఆదిలాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు సంధ్య అశోక్‌లకు సన్మానం చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్

రోడ్డుపై బైఠాయించిన విద్యార్థుల తల్లిదండ్రులు

పాఠశాల హెచ్‌ఎం, అటెండర్ సస్పెన్షన్

- పది మంది ఉపాధ్యాయులపై బదిలీ వేటు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని కురిక్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలపై లైంగిక వేధింపుల ఘటనలో అటెండర్ యాకుబ్‌పాషా, ప్రధానోపాధ్యాయురాలు టి.కమలను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. పది మంది ఉపాధ్యాయులపై బదిలీ వేటు వేశారు. బాలికల ఫొటోలు తీసి మార్ఫింగ్ చేసి వేధింపులకు పాల్పడిన అటెండర్ ఎండి.యాకుబ్ పాషాను పోలీసులు ఇప్పటికే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. విషయం తెలిసి పోలీసులకు సమాచారం ఇవ్వని హెచ్‌ఎంపై కూడా కేసు చేశారు. ఈ సంఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు మంగళవారం పాఠశాల ఎదుట బైఠాయించి ఆందోళన చేశారు. లైంగిక వేధింపుల ఘటనపై ఉన్నతాధికారులకు నివేదించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన జడ్పీహెచ్‌ఎస్ కురిక్యాల గ్రేడ్-2 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు టి.కమలను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేశారు. ఘటనపై విచారణకు ముగ్గురు అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి.. నివేదిక సమర్పించాలని ఆదేశించారు. లైంగిక వేధింపుల ఘటనను కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ ఘటనను నిరసిస్తూ బిఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గంగాధర మండల బంద్ చేపట్టారు.

మాజీ మంత్రి హరీశ్‌రావుకు పితృ వియోగం

- సంతాపం తెలిపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ అనారోగ్యంతో కన్నుమూశారు అభిమానులు, బిఆర్‌ఎస్ శ్రేణులు, ఇతర ప్రముఖుల సందర్శనార్థం ఆయన పార్థివ దేహాన్ని హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉంచారు. మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్‌నగర్‌లోని మహా ప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు సత్యనారాయణరావు భౌతిక కాయానికి బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ నివాళులర్పించారు. తన బావతో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్‌రావుకు ఫోన్ చేసి కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సిఎం రేవంత్‌రెడ్డి సంతాపం

తన్నీరు సత్యనారాయణ మృతిపట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. హరీశ్‌రావు కుటుంబా నికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహా, అడ్లూరి లక్ష్మన్ కుమార్, బిఆఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంపి ఈటెల రాజేందర్, పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ సత్యనారాయణ బౌతిక కాయానికి నివాళులర్పించారు. హరీష్ రావు తండ్రి సత్యనారాయణ రావు మరణం పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాడ సానుభూతి తెలిపారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క వేర్వేరు ప్రకటనల్లో సంతాపం ప్రకటించారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్రరావు, పలువురు బిఆర్‌ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేశారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి

- 30న ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యా సంస్థల బంద్‌కు డివైఎఫ్‌ఐ మద్దతు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

విద్యారంగ, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు డివైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతును ప్రకటించింది. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్, ఉపాధ్యక్షులు ఎండి జావీద్, ఆర్‌ఎల్ మూర్తి, హైదరాబాద్ నాయకులు రాజు మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్ ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం రూ.1,200 కోట్లు విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో ఆరేండ్ల నుంచి సుమారు రూ.ఎనిమిది వేల కోట్లకుపైగా ఫీజు బకాయిలున్నాయని అన్నారు. ప్రభుత్వం ఫీజులను విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు బలవంతంగా విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయని విమర్శించారు. ఉన్నత చదువులకు వెళ్లాలన్నా, ఉద్యోగాలు చేయాలన్నా ఫీజులు కడితేనే ధ్రువపత్రాలను ఇస్తామంటూ ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. ఫీజుల చెల్లింపు కోసం విద్యార్థులకు భరోసా ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను పర్యవేక్షిస్తూ విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోవడం లేదన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కోట రమేష్

రాణి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నీలాదేవి

వికలాంగుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం

- బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వికలాంగుల సంక్షేమం పట్ల కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో వికలాంగులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వికలాంగులకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. రూ. 4 వేల నుంచి రూ. 6 వేలకు పింఛన్ పెంపు ఏమైందని ప్రశ్నించారు. ఆధునిక ఉపకరణాల పంపిణీ, ప్రత్యేక ఉపాధి కోటా వంటి హామీలు గాలిలో కలిశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వికలాంగుల హక్కులు, గౌరవం, అవకాశాలు పొందేలా బిజెపి కృషి చేస్తోందని భరోసా కల్పించారు. నేషనల్ హ్యాండికాప్డ్ ఫైనాన్స్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధికి రుణ సహాయం అందిస్తోందని వివరించారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమ్మానాన్న.. నన్ను క్షమించండి.. అంటూ సూసైడ్ నోట్ రాసి ఓ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బిసి గర్ల్స్ హాస్టల్‌లో మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. కొల్లాపూర్ నియోజకవర్గం మొలచింతలపల్లి గ్రామానికి చెందిన స్ఫూర్తి(21) జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతోంది. మంగళవారం హాస్టల్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. తోటి స్నేహితులు చూసి హాస్టల్ నిర్వాహకులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే విద్యార్థినిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స కొనసాగుతోంది. విద్యార్థిని పరిస్థితి విషయంగా ఉందని వైద్యులు తెలిపారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

దెబ్బతీస్తున్న రసాయనిక ఆహారం

- ప్రతి 50 మందిలో ఒకరు ఆటిజంతో జననం
- గర్భధారణకు ముందే నివారణ మేలు
- పరిశోధనల్లో తేల్చిన డాక్టర్లు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పిల్లల సమగ్ర ఎదుగుదలకు అడ్డంకిగా మారే ఆటిజంతో జన్మించే పిల్లల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. గత కొన్ని దశాబ్దాలుగా ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, ప్రధానంగా రసాయనిక ఆహారపు అలవాట్లు గర్భస్థ మహిళల శరీరంలో జన్యుమార్పులకు కారణమవుతున్నట్టు పరిశోధనలు తెలుపుతున్నాయి. దీంతో గర్భంలోని పిండ దశలోనే శిశువు ఆటిజం అవలక్షణాల బారిన పడుతున్నారు. వందేళ్ల క్రితం ప్రతి 10 వేల మందిలో ఒక శిశువు ఆటిజంతో జన్మిస్తే ప్రస్తుతం దాదాపు ప్రతి 50 మందిలో ఒకరు ఆటిజం లక్షణాలతో జన్మిస్తున్నట్టు వివిధ అధ్యయనాలు, గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆటిజం సమస్య గతంలో ఎన్నడూ లేని విధంగా గత రెండు దశాబ్దాల్లో అనూహ్యంగా పెరిగినట్టు తెలుస్తోంది.

ఆటిజం బారిన పడ్డ పిల్లల్లో వయస్సుకు తగ్గట్టు మానసిక పరిపక్వత లేకపోవడం, ఎవరితోనూ కలవకుండాఒంటరిగా ఉండడం, నేరుగా కండ్లలోకి చూడలేకపోవడం, మాట్లాడలేకపోవడం, చేసిన పనులనే మళ్లీ మళ్లీ చేస్తుండడం, ఎలాంటి అనుభూతిని కూడా తెలపలేకపోవడం, గాయాలు తగిలినా తెలుసుకోలేక పోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, సరిగ్గా మాట్లాడలేక పోవడం, కారణం లేకుండా ఏడ్వడం, పిలిచినా మరియు ఎవర్నీ చూసినా పట్టించుకోకపోవడం వంటి లక్షణాలను కలిగి ఉంటారు. ఆటిజం సమస్యను తక్కువగా అంచనా వేయడం, సరైన అవగాహన లేకపోవడంతో గర్భధారణకు ముందు అవసరమైన పరీక్షలు చేయించుకోకపోవడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం కూడా ఈ సమస్యతో జన్మించే పిల్లల సంఖ్య క్రమక్రమంగా పెరుగుతోంది.

ఆటిజంతో జన్మించిన పిల్లలకు పూర్తి స్థాయిలో చికిత్స అందుబాటులో లేదు. ఇలాంటి పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గుర్తించి వారిలో సామాజిక నైపుణ్యాలను పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని వైద్యులు సూచిస్తుంటారు. ఈ క్రమంలో నైపుణ్యం కలిగిన శిక్షకుల ద్వారా కూడా కొంత మేరకు చికిత్సనందిస్తున్నారు. అయినప్పటికీ సాధారణ ఆరోగ్యంతో జన్మించే పిల్లలతో పోలిస్తే వీరి జీవితాంతం ఆటిజం సమస్యను మోయాల్సి వస్తున్నది. సమాజంలో ఆటిజంపై అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్యగా మారింది. ఈ దిశగా ప్రభుత్వాల నుంచి కూడా తగినంత ప్రచారం లేదనే చెప్పాలి.

ఆటిజం బాధిత వైద్యుల పరిశోధనలు

పెరిగిన ఆటిజం డాక్టర్ల కుటుంబాలను సైతం ఆందోళనకు గురి చేస్తున్నది. పలువురు డాక్టర్ల పిల్లలు ఆటిజం బారిన పడటంతో వారి ఆలోచనల్లో మార్పును తీసుకొచ్చింది. కార్డియాలజీ, గైనకాలజీ, డెంటల్ తదితర ప్రత్యేక వైద్య కోర్సులను అభ్యసించిన ఆ డాక్టర్లు తమ పిల్లల కోసం ఆటిజం పరిశోధనలవైపు మళ్లారు. ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి, అమెరికాకు చెందిన దంత వైద్యులు డాక్టర్ కళా రమ్య మారేపల్లి తదితర వైద్యులు తమ పిల్లలను ఆటిజం నుంచి బయటపడేసేందుకు ఏకమయ్యారు. ఆటిస్టిక్ సమస్యను ఎదుర్కొంటున్న బాలల గట్ బ్రెయిన్ యాక్సిస్‌ను పరిష్కరించే ప్రధాన చికిత్స ఫీకల్ మైక్రోబయోటా ట్రాన్స్ ప్లాంటేషన్ థెరపీని దేశంలోని తొలిసారిగా హైదరాబాద్‌లో రెస్‌ప్లెస్ ఆటిజం రీసెర్చి ఇనిస్టిట్యూట్ ద్వారా అందిస్తున్నారు.

మూలకారణాల్లోకి మా పరిశోధనలు
-డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి

2017 నుంచి పరిశోధనలు చేశాం. డాక్టర్లుగా తమ పిల్లలే ఆటిజం బారిన పడటంతో మూల కారణాలను వెతికే దిశగా లోతైన పరిశోధన జరిపాం. విషరహిత గర్భధారణకు వీలు కల్పించే దిశగా పేగు-మెదడుకు సంబంధంపై పరిశీలించాం. చిన్నారులకు పేగులకు పలు ఇబ్బందులు రావడం గమనించాం. పేగు మైక్రోబియోమ్ కు సంబంధించిన సమస్యలకు చికిత్స అందించి వారి జీవన ప్రమాణం, ప్రవర్తన, నడవడి లక్షణాలు మార్చేందుకు ప్రయత్నించాం. ఫలితంగా పేగు (గట్) మైక్రోబయోమ్ మార్పిడిని ఆవిష్కరించాం. పిల్లలతో పాటు పెద్దవారిలోనూ విషరహితమైన వ్యాధిని నియంత్రించే ప్రోటోకాల్స్ ద్వారా పేగు సంబంధితి సమస్యలకు పరిష్కారంతో పాటు తల్లుల గర్భధారణ సమయంలో ఆటిజం రావడానికి దారి తీస్తున్న బాహ్యకారకాలను నిరోధించవచ్చని నిర్ధారణకు వచ్చాం. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చి (ఐసిఎంఆర్) అనుమతితో పేగు (గట్) మైక్రోబయోమ్ మార్పిడి (జిఎంటి -ఎఫ్‌ఎంటి) పరిశోధనలో మొట్టమొదటి స్టూల్ బ్యాంక్‌ను స్టూల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశాం. ఎఫ్‌ఎంటిలో దాత మలం నుంచి ఆరోగ్యకరమైన గట్ బ్యాక్టీరియా రోగి జీర్ణవ్యవస్థలోకి బదిలీ చేయడం ద్వారా సమతుల్యత కలిగిన గట్ మైక్రోబయోమ్‌ను పునరుద్ధరిస్తాం.

ఆటిజం లేని తరం మా లక్ష్యం
-డాక్టర్ కళారమ్య మారేపల్లి

ఆటిజం లేని తరం కోసం తమ పరిశోధనలు, ప్రయత్నాలు అని డాక్టర్ కళారమ్య మారేపల్లి తెలిపారు. ఆమె తన ఏడున్నర సంవత్సరాల బాబు కోసం అమెరికాలో డెంటల్ ప్రాక్టీస్ వదిలి హైదరాబాద్‌లో ఆటిజం పరిశోధనల్లో భాగస్వామిగా మారారు. గర్భిణిలకు డీటాక్స్ ఇస్తూ, నివారణ నమూనాతో చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. గర్భధారణ సమయంలో ప్లాస్టిక్‌లు, పురుగుమందులు, సౌందర్య సాధనాలు మొదలైనవి వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకొని శరీరంలోకి విషపదార్థాలు ప్రవేశించకుండా నిరోధించేందుకు గర్భిణులు సేంద్రీయ ఆహారాన్ని మాత్రమే తినేలా ప్రోత్సహిస్తామని వెల్లడించారు.

ఉచిత అవగాహనా కార్యక్రమం

రెస్‌ప్లెస్ ఆటిజం రీసెర్చి ఇన్స్‌స్టిట్యూట్ ఈ నెల 29 నుంచి నవంబర్ 15 వరకు ఉచిత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఉచిత అసెస్‌మెంట్ ప్రోగ్రామ్‌ను అందిస్తోంది. మరిన్ని వివరాలు, రిజిస్ట్రేషన్ల కోసం 9100065552 నెంబర్ లో తల్లిదండ్రులు సంప్రదించవచ్చు.

కులదురహంకార హత్య నిందితులను కఠినంగా శిక్షించాలి

- రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు నీలాదేవి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిండు గర్భిణి అయిన కోడలిని కుల దురహంకారంతో హత్య చేసిన నిందితున్ని కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి ప్రభుత్వాన్ని కోరారు. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం గెర్రె గ్రామంలో హత్యకు గురైన రాణి కుటుంబాన్ని మంగళవారం ఆమె పరామర్శించారు. వారికి నష్టపరిహారం వెంటనే అందించాలని కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. గిరిజన మహిళ.. నిండు గర్భిణిని హత్య చేసిన శివార్ల సత్తయ్య, ఆయనకు సహకరించిన వారందరినీ అరెస్టు చేసి శిక్షించాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఆమె వెంట కాగజ్‌నగర్ డిఎస్‌పి వాహిదుద్దీన్, ఎస్‌ఐ విక్రమ్, గిరిజన సంఘాల నాయకులున్నారు.

తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతికి సంగీత స్వర నివాళి

ప్రజాశక్తి కల్చరల్

మోహన్ మెలోడీస్ నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ఇటీవల మృతి చెందిన తొలి తెలుగు నేపథ్య గాయని రావు బాలసరస్వతికి సంగీత స్వర నివాళి కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. సాహితీ వేత్త ఒలేటి పార్వతీశం మాట్లాడుతూ ఆకాశవాణిలో లలిత గీతాలు సాలూరి రాజేశ్వరరావుతో కలిసి బాల సరస్వతి గానం చేసి ప్రాచుర్యం కలిగించిన ప్రతిభా గాయని అని పేర్కొన్నారు. కిన్నెర రఘురాం రసమయి డాక్టర్ ఎంకె రాము సంఖ్యా శాస్త్ర వేత్త దైవజ్ఞ శర్మ సంగీత స్వరకర్త విన్నకోట మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. సంస్థ స్థాపకుడు కలగ కృష్ణ మోహన్ సారధ్యం. వహించగా శశి కళ సురేఖ దుర్గ మాధవి బాల కామేశ్వర రావు చింతలపాటి సురేశ్ లక్ష్మణ్ నాగేశ్వరరావు తదితరులు బాల సరస్వతి, ఎస్ రాజేస్వర రావు ఘంటసాలతో కలసి పాడిన పాటలు మధురంగా ఆలపించారు.